بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 09.06.2017 (TELUGU)**

## ప్రతి అహ్మదీ తన ప్రవర్తనల పట్ల దృష్టి సారించవలెను

**ఒక అహ్మదీ ప్రవర్తనలతో ప్రభావితమై లేదా సంయుక్తముగా జమాఅత్ ప్రవర్తనలతో ప్రభావితమై అహ్మదీలగుచున్న వారు చాలా మంది యున్నారు. కనుక సత్ప్రవర్తనలు తనని దైవభీతిలో పెంచడమే కాక ఇదొక ధార్మిక కర్తవ్యము, ఇతరుల సంస్కరణకు కారణము కూడ అని ప్రతి అహ్మదీ గర్తుంచుకోవలెను**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 09.06.2017 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మార్డన్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి.

హృదయములలో దైవభీతిని సృష్టించుటయే ఉపవాసముల, రమజాన్ ఉద్ధేశమని అల్లాహ్ తఆలా తెలిపినట్లు నేను గత ఖుత్బాలో ప్రస్తావించియుంటిని. దీనిని పొందు పద్ధతుల గురించి నేను హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పలు పంక్తులను ప్రవేశపెట్టితిని. ఈ అంశమును మన హృదయములలో నాటుటకు, దీని ప్రాముఖ్యత మన హృదయములలో పాతుకుపోవలెను, మన ప్రతి కర్మ, ప్రవర్తనతో ఇది బహిర్గతము కావలెనని హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వివిధ చోట్ల దీని వివరణను తెలిపారు. ఎందుకనగా దైవభీతి లేనిచో ఎటువంటి పుణ్యము ఫలవంతము కాదు. ప్రతి వ్యక్తి సమయానుసారము ఏదో తాత్కాలిక ఉద్రేకము, కారణముతో చేయును. కాని స్వచ్ఛమైన దైవభీతి యున్నప్పుడే క్రమ శిక్షణ వచ్చును. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. దైవభీతికి అనేక రకాలు గలవు. గర్వము, అహంకారము, నిషిద్ధ ధన ప్రేమ నుండి దూరముండుట, దుష్ప్రవర్తనల నుండి దూరముండుట కూడ దైవభీతియే. మంచి ప్రవర్తనలను ప్రత్యక్షపరచు వ్యక్తి శత్రువులు కూడ మిత్రులగుదురు. అల్లాహ్ తఆలా ادفع بالتی ھی احسن అనెను. వ్యతిరేకి దూషించినను అతనికి సమాధానముగా దూషించక సహనము పాటించవలెను. ఫలితముగా మీ ప్రాముఖ్యతను వ్యతిరేకి అంగీకరించి అతడే సిగ్గుడును, మౌనము వహించును. విధానపరంగా మీరు అతనికివ్వదలచిన శిక్ష కంటే ఈ శిక్ష చాలా కఠినముగా యుండును.

ప్రవర్తనలు అనగా మృదువుగా వ్యవహరించడము మాత్రమేనని ఎవరూ ఊహించకూడదు. ఖల్క్, ఖుల్క్ అని రెండు పదములు గలవు. ఇవి రెండు విరుద్ధ భావములు కలగియున్నవి. ఖల్క్ అనగా బాహ్య పుట్టుక. ఉదా॥ చెవి, ముక్కు. తుదకు వెంట్రుకలు మొదలగవన్ని కూడ ఖల్క్ అనబడును. ఖుల్క్ అనగా అంతర పుట్టుక. మానవునిలో, మానవేతరులలో గల అంతర శక్తులన్ని ఖుల్క్ అనబడును. తుదకు తెలివి, ఆలోచన మొదలగు శక్తులన్ని ఖుల్క్ అనబడును.

ప్రవర్తనలు అనగా అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుట. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితము ప్రకారము తమ జీవితమును గడుపుట ఇందుకు అనివార్యము. انک لعلی خلق عظیم అని వారి గురించి అల్లాహ్ తఆలా తెలిపెను. జీవితములోని ప్రతి భాగములో ప్రవర్తనల సాటిలేని ఉదాహరణను వారు నెలకొల్పిరి. ఆ ఉదాహరణను తమ శక్తి, సామర్థ్యము మేరకు పాటించుట ప్రతి విశ్వాసి కర్తవ్యము. ఒక్కోసారి సాహిత్య ప్రసంగముతో ఒక సమూహమును చిత్ర రూపంలో ఆశ్చర్య చకితులు చేసేవారు. మరొక్కసారి యుద్ధ మైదానములో వీరత్వము ప్రదర్శించేవారు. దానము చేయదలచినచో బంగారు పర్వతమును దానము చేసేవారు. క్షమించదలచినచో ప్రాణ శిక్ష పడ్డవారిని కూడ క్షమించేవారు. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం సాటిలేని, నిరుపమాణ ఆదర్శమును అల్లాహ్ తఆలా చూపెను. ఖైసర్, కిస్రా (చక్రవర్తులు) వద్ద కూడ లేనన్ని మేకలు, గొర్రెలు వారి (సల్లం) వద్ద యుండగా వాటిన్నటిని ఒక యాచకునికి దానమిచ్చిరి. ప్రవర్తనలను ఇలా చూపారు. దగ్గర లేనిచో దానమెలా ఇచ్చేవారు. అధికారము లేనిచో ప్రాణ శిక్ష పడ్డవారిని ప్రతీకారము తీసుకునే శక్తి యున్నను క్షమించేవారని ఎలా రుజువగును. అనుచరులు, హుజూర్ అలైహిస్సలాం, ముస్లిం స్త్రీలను తీవ్ర బాధలు, ఇబ్బందులకు గురి చేసినవారు

పట్టుబడగా వారిట్లనిరి لا تثریب علیکم الیوم. ఇవి సంపూర్ణమైన ఆదర్శములు. ఈ మహా ప్రవక్త ఆదర్శములను మీరు తమ శక్తిమేర, తమ సామర్థ్యముల మేరకు అనుసరించమని అల్లాహ్ తఆలా సూచించెను. మానవుడు శ్రమ పడనంత వరకు, దుఆ చేయనంత వరకు హృదయములో పడిన మలినము దూరము కాదు. అందుకే అల్లాహ్ తఆలా ఇట్లనెను. ان اللہ لا یغیر ما بقوم حتی یغیروا ما بانفسھم జాతిపై పడే విపత్తు, ఆపదను ఆ జాతి సవ్యముగా దూరము చేయుటకు ప్రయత్నించనంత వరకు అల్లాహ్ దూరము చేయదు. అల్లాహ్ తఆలా మారని పద్ధతి ఇది. అందుకే ولن تجد لسنت اللہ تبدیلا అని అనెను. మన జమాఅతైనా లేదా ఇతరులైనా శ్రమించి, దుఆ చేసినప్పుడే తమ ప్రవర్తనలను మార్చుకోవచ్చును.

మానవుని ప్రవర్తనలు ఎంత వరకు క్షీణించినా సంస్కరించుకోదలచినచో సంస్కరించుకోవచ్చునని తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. ఇందుకు శ్రమించవలసి యుండును. అసలు విషయమేమనగా అలసత్వము, సోమరితనము వహించకూడదు. ప్రయత్నించినచో మార్పు సంభవించవచ్చును. ప్రవర్తనలు మారవని వాదించే మేధావులు పొరపాటునకు గురైనారు. లంచం తీసుకునే ఉద్యోగులు నిజమైన పశ్చత్తాపము చేసినప్పుడు ఎవరైనా వారికి బంగారు పర్వతము ఇచ్చినా దృష్టి సారించరని మనము చూస్తుంటాము.

ప్రవర్తనలను చక్కదిద్దుకోవలెనని తెలుపుచు వారిట్లనిరి. వృద్ధాప్యము రెండు రకాలు. ఒకటి సహజము, మరొకటి అసహజము. బాహ్య శరీరము వృద్ధాప్యమునకు చేరుట సహజము. వచ్చుచున్న వ్యాధులను లెక్కచేయక పోవడం అసహజము. సోకుచున్న వ్యాధులను లెక్క చేయకపోవడంతో అవి మానవున్ని బలహీనపరచి సమయము కంటే ముందే వృద్ధున్ని చేయును. ఇదే విధముగా అంతర, ఆధ్యాత్మిక విధానములో కూడ జరుగును. తమ దుష్ప్రవర్తనలను ఎవరైనా సత్ప్రవర్తనలు, సద్గుణములుగా మార్చుకొనుటకు ప్రయత్నించినచో అతని ప్రవర్తనల స్థితి దిగజారిపోవును. ప్రతి వ్యాధికి చికిత్స గలదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశము, పవిత్ర ఖుర్‌ఆన్ బోధనతో రుజువైనది. సోమరితనము, అలసత్వము జయించినచో వినాశము తప్ప మరో దారి లేదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ సోమరితనమును దూరము చేయుటకు అల్లాహ్ తఆలా నేడు అవకాశము కల్పించెను. ఈ నెలలో ప్రవర్తనలను చక్కదిద్దుకొనుటకు కూడ ప్రతి ఒక్కరు దృష్టి సారించవలెను. బలహీనతలు, పాపముల నుండి దూరముండుటకు కూడ శ్రద్ధ వహించవలెను. ఈ వాతావరణము ఏర్పడినను దృష్టి సారించనిచో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపినట్లు వృద్ధాప్య స్థితి వైపు వెళ్లి అతని జీవితము అంతమగును. అనంతరం దైవభీతి లేకుండానే మానవుడు అల్లాహ్ తఆలా ఆస్థానములో చేరును.

ప్రవర్తనలు పొందుటకు పశ్యత్తాపము వైపు సూచించుచు వారిట్లనిరి. ప్రవర్తనలు పొందుటకు పశ్చత్తాపము ఒక గొప్ప సహాయ, సహకారము. మానవున్ని పరిపూర్ణము చేయును. అనగా తన దుష్ప్రవర్తనలను మార్చుకోదలచిన వారు నిజమైన, స్వచ్ఛమైన సంకల్పముతో పశ్చత్తాప పడవలెను. పశ్చత్తాపమునకు మూడు నిబంధనలు గలవు. వాటిని పూర్తి చేయనిదే నిష్కపట పశ్చత్తాపము సాధ్యము కాదు.

ఈ మూడు నిబంధనలలో మొదటి నిబంధనను **ఇఖ్లా** అంటారు. అనగా దుష్ట ఆలోచనలు, భావాలను వీడవలెను. ఉదా॥ ఒక వ్యక్తికి ఒక స్త్రీతో అక్రమ సంబంధము యున్నచో పశ్చత్తాపము కొరకు ఆమె ముఖమును అతి హీనంగా భావించుట తప్పనిసరి. ఆమె చెడు అలవాట్లన్నిటిని తమ హృదయములో ఆలోచించవలెను. ఎందుకనగా నేను చెప్పినట్లు భావముల ప్రభావము ఎంతో పడును. మానవున్ని కోతి లేదా పంది రూపంలో చూచిరని నేను సత్కార్యుల చరిత్రలో చదివినాను. కనుక భావించిన విధముగా మానవుడు మారిపోవును. దురవాట్లకు కారణమైన ఆలోచనలన్నిటిని దహనము చేయవలెను. ఇది మొదటి నిబంధన.

రెండవ నిబంధన పశ్చత్తాపము. పాపము, తప్పు చేసినప్పుడు పశ్చత్తాపము వ్యక్తపరచవలెను. ఈ రుచులు తాత్కాలికమైనవి, కొన్ని రోజులకే పరిమితమని భావించవలెను. ప్రతి సారి ఈ రుచిలో, ఆనందములో తగ్గుదల వచ్చుచున్నదని భావించవలెను. వృద్ధాప్యము వచ్చినప్పుడు శక్తులు నిరుపయోగము, బలహీనమగును. తుదకు ఈ రుచులన్నిటిని, ప్రపంచమును వీడవలసి వచ్చును. జీవితములోనే ఈ రుచులన్ని వెళ్లిపోవుచున్నప్పుడు వాటిని చేయడంతో ఏమి లభించును? పశ్చత్తాపము వైపు దృష్టి సారించిన వ్యక్తి ఎంతో అదృష్టవంతుడు. మొదట అతనికి ఇఖ్లా ఆలోచన కలుగవలెను. అనగా చెడు ఆలోచనలు, వృథా భావాలను నాశము చేయవలెను. ఈ మలినము, అపరిశుభ్రత ముగిసిన తరువాత సిగ్గుపడి, తన కర్మల పట్ల పశ్చత్తాపపడవలెను.

మూడవ నిబంధన. ఆయా పాపముల వైపు భవిష్యత్తులో మరల దృష్టి కలిగించనని దృఢ సంకల్పము

చేయవలెను. వీరులు, ధీరులు మన జమాఅత్‌నకు అవసరం లేరు. ప్రవర్తనలను మార్చుకొనుటకు ప్రయత్నించువారు అవసరమున్నారు. పర్వతమును కదిలించగల వ్యక్తి వీరుడు, శక్తిమంతుడు కాడు. ప్రవర్తనలను మార్చుకొను శక్తి గల వ్యక్తియే నిజమైన వీరుడు. ప్రవర్తనలను మార్చుకొనుటకు ధైర్యము, శక్తిని పూర్తిగా వినియోగించుకోవలెనని గుర్తుంచుకొనుము. ఎందుకనగా ఇదే నిజమైన శక్తి, ధైర్యము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ప్రవర్తనపరమైన అద్భుతము గురించి ఎవరు విమర్శించలేరు. అందుకే మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు అన్నిటి కంటే గొప్ప శక్తి, అద్భుతము ప్రవర్తనలదే నొసంగబడెను. అందుకే انك لعلى خلق عظيم అనెను. అన్ని రకాల అద్భుతములు, శక్తిని నిరూపించుటలో సకల ప్రవక్తల అద్భుతముల కంటే ముందుండిరి. కాని వారి ప్రవర్తనల గొప్పతనము వారందరిలో ప్రథమ స్థానంలో యుండెను. దాని ఉదాహరణ ప్రపంచ చరిత్ర గతములో చూపలేదు, భవిష్యత్తులో చూపే ఆస్కారం లేదు.

వారిట్లనిరి. తన దుష్ప్రవర్తనలు, నీచ అలవాట్లను వీడి సద్గుణములను అలవర్చుకొన్న ప్రతి వ్యక్తికి అదొక అద్భుతమని నేను భావించుచున్నాను. ఉదా॥ కఠిన స్వభావము గల ఒక వ్యక్తి, కోపిష్టి తన ఈ అలవాట్లను వీడి మృదుత్వము, క్షమాగుణమును అవలంభించినచో నిస్సందేహముగా ఇది అద్భుతమే అగును లేదా క్షమాగుణమును అవలంభించి, లోభితనమును వీడి దాన గుణమును, ఈర్ష్యను వీడి సానుభూతిని అలవర్చుకొన్నచో నిస్సందేహముగా ఇది అద్భుతమగును. గర్వము, అహంకారమును వీడి నిరాడంబరతను అలవర్చుకొన్నచో ఈ నిరాడంబరత అద్భుమతగును. అద్భుత శక్తిగా ఎదుగుటకు మీలో ఎవరు ఇష్టపడరు. ప్రతి ఒక్కరు దీనిని ఆశిస్తారని నాకు తెలుసు. మానవుడు ప్రవర్తనల స్థితిని చక్కదిద్దుకోవలెను. ఎందుకనగా ఇదొక అద్భుతము. దీని ప్రభావము ఎన్నడు అంతము కాక దీనిలాభము సుదీర్ఘ కాలము వరకు కొనసాగును. దేవుడు, ప్రాణుల దృష్టిలో అద్భుతముగా మారుము. ఎటువంటి అద్భుతమును అంగీకరించని దుష్టులు ప్రవర్తనల స్థితిని చూచి తమ తల దించుకొన్న వారిని చూడనైనది. ఒప్పుకోక, అంగీకరించక మరో దారి వారికి లేకుండెను. ప్రవర్తనల అద్భుతమునే చూచి వారు నిజమైన ధర్మమును స్వీకరించిన విషయమును చాలా మంది జీవిత చరిత్రలో మీరు పొందగలరు.

విశ్వసించు వివిధ మార్గముల గురించి వారిట్లనిరి. సందేశహరులకు వ్యతిరేకంగా యున్న ప్రత్యేకంగా మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు వ్యతిరేకంగా యున్న దుష్టులు అద్భుతములను చూచి విశ్వసించలేదు. అద్భుతములు, వైభవములను చూచి వారు సంతృప్తి పొందలేదు. వారు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప ప్రవర్తనలను చూచి వారి సత్యమును అంగీకరించారు. పెద్ద పెద్ద సంకేతములను కూడ చూచి సంతృప్తి చెందని వారు సద్గుణములను చూచి తల వంచిరి. అసలు విషయమేమనగా కొందరు బాహ్య అద్భుతములు, వైభవములను చూచి విశ్వసించెదరు. కొందరు విజ్ఞానములు, రహస్యములను చూచి విశ్వసించెదరు. కాని సద్గుణములే అనేక వ్యక్తుల మార్గదర్శనము, సంతృప్తికి కారణమగును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఒక అహ్మదీ ప్రవర్తనలతో ప్రభావితమై లేదా సంయుక్తముగా జమాఅత్ ప్రవర్తనలతో ప్రభావితమై అహ్మదీలగుచున్న వారు చాలా మంది యున్నారు. కనుక సత్ప్రవర్తనలు తనని దైవభీతిలో పెంచడమే కాకా ఇదొక ధార్మిక కర్తవ్యము, ఇతరుల సంస్కరణకు కారణము కూడ అని ప్రతి అహ్మదీ గర్తుంచుకోవలెను. పతి అహ్మదీ తన ప్రవర్తనల పట్ల దృష్టి సారించవలెను.

విశ్వాస పద్ధతి ఏమిటని వివరించుచు వారిట్లనిరి. అల్లాహ్‌తో సంస్కరణ ఆశించుట, తమ శక్తిని వినియోగించుటయే విశ్వాస పద్ధతి. నమ్మకముతో దుఆ కొరకు తమ చేతులను లేపిన వ్యక్తి దుఆను అల్లాహ్ తఆలా రద్దు చేయడని పవిత్ర హదీసులో గలదు. కనుక నమ్మకము, సదుద్దేశముతో దేవున్నే అడుగుము. మంచి ప్రవర్తనలను ప్రదర్శించుట తమ అద్భుతమును ప్రదర్శించుటయే అగును. భూమండలంపై కనిపించుచున్న ఈ కోట్లాది ముస్లిములు ఖడ్గము, నిర్బంధముతో ముస్లిములైనారా? కాదు. ఇది శుద్ధ తప్పు. ఇస్లామీయ అద్భుత శక్తియే వారిని ఆకిర్షంచెను. ఇస్లామీయ సత్యపు ఆత్మ శక్తి ఇతర జాతీయులను ఇస్లాంలో చేరుటకు విధిలేకుండా చేసినదని గొప్ప గొప్ప అంగ్ల పరిశోధకులు కూడ నమ్మవలసి వచ్చినది. ప్రవర్తనలు కూడ దైవఫలహారమే, వాటిని ప్రదర్శించుట కూడ అల్లాహ్ తఆలా నొసంగిన ఆహారమును వినియోగించినట్లే అగును, ఇది కూడ దైవభీతిలోని ఒక ఆచరణాత్మక భాగమని తెలుపుచు వారిట్లనిరి. ఆహారమనగా తినుభండారాలని సామాన్య ప్రజలు భావిస్తారు. ప్రసాదించబడిన శక్తులన్ని ఆహారమే అనబడును. విద్యలు, వృత్తులు, విజ్ఞానములు, రహస్యముల మొదలగువన్ని

లభించును. బాహ్య రూపంలో ధనములో విశాలత లబించుట, దాసుని సామర్థ్యములు, అతని ప్రవర్తనలు, అతని ధనము ప్రతి వస్తువు కూడ ఆహారమే. ప్రభుత్వము కూడ ఆహారములో పరిగణించబడును. సద్గుణములు కూడ ఆహారములోనే పరిగణించబడును.

తన ధనము నుండి ఇతరునికి ఇవ్వని వారే లోభికులు కారు. అల్లాహ్ తఆలా ప్రసాదించిన విద్యను ఇతరులకు నేర్పని వారు కూడ పిసినారులే. ఇతరులు నేర్చుకున్నచో అగౌరవము ఎదురగును లేదా ఆదాయములో తగ్గుదల ఏర్పడునను ఆలోచనతో విద్యలు, వృత్తులు ఇతరులకు నేర్పనివారు అన్యారాధనకు పాల్పడుతారు. ఇలా వారు విద్య లేదా వృత్తినే దేవునిగా భావించిరి. తన సద్గుణములను చూపనివారు కూడ పిసినారులే. అల్లాహ్ తఆలా ప్రసాదించిన సద్గుణములతో అతని ప్రాణుల పట్ల సత్ప్రవర్తనతో వ్యవహరించుటయే ప్రవర్తనలు ఇచ్చుట అగును. అతని ప్రవర్తనల ఉదాహరణను చూచి ప్రజలు కూడ అనుసరించుటకు ప్రయత్నింతురు.

మృదువుగా మాట్టాడడం మాత్రమే ప్రవర్తనలు కాదు. మానవునికి ప్రసాదించబడిన ధైర్యము, అభిమానము, పవిత్రత వంటి శక్తులన్ని ప్రవర్తన పరమైన శక్తులే. వాటిని సమయానుకూలంగా వినియోగించుటయే ప్రవర్తనలను వెల్లడించుట అగును.

తమ జమాఅత్ సభ్యులు గొప్ప ప్రవర్తనలను అవలంభించాలని, తమలో మార్పు కలిగించుకోవాలని సూచించుచు వారిట్లనిరి. గతములో ఏముండెనో ఇప్పుడేమైనాడో అని తమ పొరుగువారికి ప్రవర్తనలో మార్పు చూపినవాడే ఒక అద్భుతమును చూపును. దీని ప్రభావము పొరుగువారిపై చాలా గొప్పగా పడును. ఒక వ్యక్తి ఒక సంస్థలో ప్రవేశించి ఆ సంస్థ మర్యాద, గౌరవమును పాటించక, దానికి విరుద్ధముగా వ్యవహరించువారు అల్లాహ్ తఆలా దృష్టిలో శిక్షార్హులు. అతడు స్వయముగా నాశము కావడమే కాక ఇతరులకు కూడ చెడు ఉదాహరణగా మారి వారిని కూడ పుణ్యము, మార్గదర్శన మార్గము నుండి దూరము చేయును.

మనము వారి బైఅత్ చేసి తమలో ప్రవర్తనల మార్పులు సృష్టించుకున్నామని, పవిత్ర మార్పులు కలిగించుకొన్నామని మన ప్రతి కర్మతో ప్రత్యక్షము కావలెను. ప్రజలకు కూడ ప్రచారము చేయగలరు. ప్రచారమునకు ఇదొక దారి. దైవభీతిని అవలంభించుచు తమలో పవిత్ర మార్పులు కలిగించుకొనుటకు, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఆదర్శమును అనుసరించుటకు, గొప్ప ప్రవర్తనలను అనుక్షణం బహిర్గతపరచుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఆశయము మేరకే మన జీవితములను గడుపువారమగుదుము గాక!

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ ఇట్లనిరి. నమాజ్ తరువాత నేను రెండు పరోక్ష్య అంత్యక్రియ ప్రార్థనలను చదివించెదను. మియా అతువుర్రహ్మాన్ గారి కుమారులైన లుత్ఫుర్రహ్మాన్ మహ్మూద్ ఆఫ్ ఆమెరికా గారిది ఒకటి. 27 మే 2017 తేదీన వీరు మృతి చెందిరి. اناللهوانااليهراجعون. రెండవది రాకుమారులు క్రీ॥ శే॥ డా॥ మిర్జా మునవ్వర్ అహ్మద్ గారి కుమారులు చి॥ మిర్జా ఉమర్ అహ్మద్ గారిది. 5 జూన్ తేదీన మధ్యహ్నం 2 గం॥లకు తాహిర్ హార్ట్ ఇన్స్టిట్యూట్ రబ్వాలో 67 సం॥ల వయసులో వీరు మృతి చెందిరి. اناللهوانااليهراجعون. వీరువురి సద్గుణములను హుజూరె అన్వర్ ప్రస్తావించిరి.

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Hafiz Syed Rasool Niyaz, Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

..............................................................................

..............................................................................

..............................................................................